క్లుప్తంగా

ఎట్టకేలకు పూడిక తీత పనులు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధి దొండపాడు రస్తాలో ఉన్న డ్రైనేజీలోని పూడిక తీత పనులను మున్సిపల్ అధికారులు బుధవారం చేపట్టారు. రెండు వారాల క్రితం జనసేన పార్టీ కో–ఆర్డినేటర్ జగదీష్ ఈ సమస్యను మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యా సామగ్రితో విద్యార్థులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని మహేశ్వరనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సంగం నాగమల్లారెడ్డి బుధవారం విద్యా సామగ్రిని అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురామిరెడ్డి తెలిపారు. ప్రతి నెల విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు ఇతర వస్తువులను కూడా అందజేస్తారన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


దోమల నివారణకు ఆల్ఫాసైపర్ మిత్రిన్ పిచికారీ చేయిస్తున్న సిద్దయ్య

వేంపల్లి : స్థానిక ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో పాఠశాల నందు ఆల్ఫాసైపర్ మిత్రిన్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా జిల్లా మలేరియా అధికారిణి మనోరమ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆల్ఫాసైపర్ మిత్రిన్ 10 నుంచి 12 వారాల వరకు దాని పని సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. పిచికారీ చేసిన ప్రదేశంలో దోమ వాలితే నిమిషాల్లో చనిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగస్వర్ల, ఏఎన్ఎం అరుణ, ఆశాకార్యకర్త రాజేశ్వరిలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలి

జమ్మలమడుగు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికుల హక్కులను కాల రయటానికి ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు, కార్యదర్శి దాసరివిజయ్, ఏసుదాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట కార్మికుల హక్కుల, చట్టాలను రద్దుచేయాలనే ఆలోచన ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, బడ్జెట్ పెంచాలని అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ టీచర్లను వేధించడం తగదు


సీడీపీవోకు వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

ముద్దనూరు : తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్లకు న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందిని వేధించి వారిని విధుల్లో నుంచి తొలగించడం తగదని ఆ శాఖ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి తదితరులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో యూనియన్ సభ్యులు సీడీపీవో ముంతాజ్‌బేగంకు అంగన్‌వాడీ కోర్కెల దినోత్సవం సందర్భంగా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల బెదిరింపులు మానుకోవాలి

కడప వైఎస్సార్ సర్కిల్: చిన్నచిన్న ఉద్యోగులను, కార్మికులను రాజకీయాలతో ముడి పెట్టి అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని, ఇది తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ, ఆశా, హాస్టల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, చిరు కార్మికులను తొలగించి, వారి స్థానంలో తమ పార్టీ వాళ్లను నియమించుకోవాలనే అధికార పార్టీ నేతల ఆలోచన దుర్మార్గమని, అలాంటి ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. చిరు ఉద్యోగులను, కార్మికులను తొలగిస్తే ఉద్యమాలకు సన్నద్ధమవుతామని హెచ్చ రించారు.

సరైన సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు


వల్లూరు : తప్పెట్ల వద్ద వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి


వీఎన్‌పల్లె : రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వల్లూరు : రైతులు వరి పంట సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం వలన మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం వుందని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తప్పెట్ల గ్రామ పొలాల్లో రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంటను మండల వ్యవసాయశాఖ అధికారి సాయిజ్యోతితో కలిసి బుధవారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటను ఉల్లి కోడు ఆశించడానికి అవకాశం వుందన్నారు. రైతులు వరి పంట నాటిన 20 రోజుల తరువాత ఎకరాకు 8 కిలోల చొప్పున ఫిప్రోనేట్ గుళికలు చల్లుకోవడం ద్వారా ఉల్లికోడుతో బాటు కాండం తొలుచు పురుగు, ఆకు ముడుత పురుగులను కూడా నివారించవచ్చునని తెలిపారు. ఈ గుళికలను ఇసుకతో కలిపి పొలంలో పలుచగా నీటిని వుంచి చల్లుకోవాలని సూచించారు. అదేవిధంగా 21 రోజుల నారు మడిలో కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలను సెంటు మడికి 160 గ్రాముల చొప్పున ఇసుకతో కలిపి చల్లుకుంటే అన్ని రకాల చీడ పీడల నుండి రక్షణ పొందవచ్చునని తెలిపారు. పంట నాటిన తరువాత ఆకు ముడుత పురుగును గానీ, కాండం తొలుచు పురుగును గానీ గుర్తిస్తే కార్టప్ హైడ్రో క్లోరైడ్ లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికార చేయాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి మాట్లాడుతూ రైతులందరూ వరి పంటను నాటే సమయంలో ప్రతి రెండు మీటర్లకు ఒక చోటు 20 సెంటీ మీటర్ల చొప్పున తూర్పు, పడమర దిశగా కాలి బాటలను తప్పని సరిగా తీసుకోవాలన్నారు. దీని వలన పంట పొలంలో గాలి, వెలుతురు బాగా ప్రసరించి చీడ పీడల ఉధృతి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నీహారిక, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ, మినుము పంటలు తెగుళ్ల బారిన పడకుండా ఉండేందుకు నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని అనిమెల గ్రామంలో సాగు చేసిన మినుము పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు పడినందున మినుము పంట తెగుళ్ల బారినపడే అవకాశం అధికంగా ఉంటుందన్నారు.పంట లేతదశలో ఉన్న సమయంలో ఆకులపై రంధ్రాలు ఏర్పడటం, మినుము పంటలో పేను, బంక కాండము, పూతపై ఒక పొరలా ఏర్పడి రసం పీలుస్తుంటాయన్నారు. దీన్ని నివారించేందుకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ లేదా అసిపేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎమమెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాయులు, 19,19,19 ఎరువును 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని అలాగే పల్లాకు తెగులు సోకినప్పుడు మొక్కల ఆకులు పసుపురంగులోకి మారుతాయని ఈ వైరస్ తెల్లదోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు ఎసిటామాప్రిడ్ 0.5 గ్రాములు, ఫ్లోనికామిడ్ 0.3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. రైతులకు ఏవైనా సలహాలు సూచనలు కావాలన్నా మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందికి తెలియజేయాలని వారు సరైన సూచనలు సలహాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రెడ్డెప్ప, రైతులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ గదులకు వేలం పాట

ఎర్రగుంట్ల : పట్టణంలోని పాత నగర పంచాయతీ కాంప్లెక్స్‌లో ఉన్న గదిని అద్దెకు ఇవ్వడానికి గురువారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో వేలం పాటను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం గుడ్‌విల్ కింద రూ.5000 చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.1000 చెల్లించాలన్నారు. నెలకు అద్దె రూ.1350 ఉంటుందన్నారు. ఈ గదిని ఓసీ విభాగంనకు కెటాయించామన్నారు.

మంత్రిని కలిసిన పులివెందుల ప్రజలు

పులివెందుల రూరల్ : రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం పులివెందులకు రావడంతో ఆయనను కలిసేందుకు ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు సర్వీసును నెరవేర్చేవిధంగా చూడాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తొందరలోనే చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణ బేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి చెన్నూరు మండలాన్ని మోడల్ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల సభాభవనంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు విషయంలో అధికారులు ఎక్కడెక్కడ ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి వాటన్నిటిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. చెన్నూరు కొత్త రోడ్డు వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా ఇళ్లు, స్థలాలు కోల్పోయిన బాధితులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాల మంజూరు వీలైనంత తొందరగా ఇచ్చే విధంగా చూడాలని తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు తెలిపారు. కేసీ కెనాల్ మెయిన్ కాలవకు ఇరువైపులా ఉన్న వారు తమ బాత్రూములకు సంబంధించిన మురుగు నీటిని కాలువలోకి వదులుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. పది రోజులలోగా కాలువలోకి మురికినీళ్లు వదలకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ఆయన పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు దీనిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) సంబంధించి స్థలం మంజూరు చేయించాలని అదేవిధంగా చుక్కల భూములకు సంబంధించి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రైతుల చుక్కల భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన తహసీల్దార్‌కు సూచించారు. మండలంలో ఎక్కడెక్కడ ఏయే పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయో ఆ పనులకు సంబంధించిన సమగ్రమైన సమాచారంతో తన వద్దకు ఆయా అధికారులు రావాలని వాటన్నిటిని పరిశీలించి పనులు కొనసాగేందుకు పనిచేద్దామని ఆయన అధికారులకు తెలిపారు. జాతీయ రహదారి నిర్మించి టోల్గేట్ పెట్టి డబ్బులు వసూలు చేసుకోవడం తప్ప అక్కడి ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవని కనీస అవసరాలు కూడా తీర్చలేని విధంగా నేషనల్ హైవే అధికారుల తీరు ఉందన్నారు. మండల అధికారులు ఈ సమావేశంలో తీసుకొచ్చిన సమస్యలను వచ్చే సమావేశానికల్లా పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి, పీఆర్ డీఈ మురళి, ఎంఈఓ గంగిరెడ్డి, ఏపీఓ శైలజ, ఏవో శ్రీదేవి, ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, వెటర్నరీ డాక్టర్ ఉపేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఏపీఎం గంగాధర్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే సందర్శించి ప్రధానోపాధ్యాయురాలు రత్నాదేవిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ బ్యాగులు పంపిణీ చేశారు.

ఇసుక అక్రమ రవాణా జరిగితే చర్యలు తప్పవు


ఇసుక పంపిణీపై అధికారులతో ఆరా తీస్తున్న ఆర్‌డీఓ వెంకటపతి

కమలాపురం : ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తప్పవు అని కడప ఆర్‌డీఓ వెంకటపతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రామచంద్రాపురం సమీపంలోని సాండ్ స్టాక్ యార్డును ఆయన పరిశీలించారు. ఇసుక పంపిణీ విధానంపై ఆరా తీశారు. ఇసుక అక్రమ రవాణ జరగకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణ జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఒక ఆధార్ కార్డు కేవలం 20 టన్నులు మాత్రమే ఇసుక ఇవ్వాలన్నారు. అదీ కూడా అవసరమైన వారికే ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక లోడింగ్ చేయాలన్నారు. మీసేవ ద్వారా నమోదు చేసుకున్న ఆన్‌లైన్ స్లిప్పులు తీసుకుని వచ్చిన వారికే ఇసుక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏపీఎం అపర్ణదేవి, ఆర్ఐ అర్జున్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగులు

పులివెందుల రూరల్ : పులివెందులకు చెందిన చెవిటి, మూగ ఎగ్జిక్యూటివ్ జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లు శ్రీవిదయ్, జగదీష్‌కుమార్, జనరల్ సెక్రటరీ ఇర్ఫాన్‌లు బుధవారం జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను కడపలోని కలెక్టర్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దివ్యాంగ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన స్పందిస్తూ దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. జిల్లాలోని దివ్యాంగులు సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వేంపల్లి : ఖరీఫ్ పంట సాగుకు సంబంధించి కౌలు రైతులు తమ గుర్తింపు (సీసీఆర్సీ) కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్, వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్‌లు సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు రైతు సేవా కేంద్రాలు, రెవెన్యూ సిబ్బంది, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు కార్డులు తీసుకున్న వారికి మాత్రమే పట్టాదారులతో సమానంగా ఈ ఏడాది నుంచి కౌలు రైతులకు పంట నమోదు చేసేందుకు వీలుంటుందన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా వచ్చే నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, పీఎం ఫసల్ బీమా తదితర పథకాలు పొందేందుకు అర్హులవుతారన్నారు. కౌలు రైతులు తమ గుర్తింపు కార్డు కోసం వీఆర్‌ఓ, రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ శివలక్ష్మి, వీఆర్‌ఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటి నీరు పోస్తున్న అటవీశాఖ రేంజ్ అధికారి బాలసుబ్రమణ్యం

వేంపల్లి : పర్యావరణ సమతుల్యత, పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వేంపల్లె అటవీశాఖ రేంజ్ అధికారి బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అమ్మ పేరిట ఒక చెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమిపై మానవాళి మనుగడకు ప్రకృతి సమతుల్యత ఎంతో అవసరమన్నారు. అందువల్ల అడవులు, చెట్లు నరికివేత మానుకోవాలని సూచించారు. మొక్కలు పెంచడం ద్వారా చల్లని వాతావరణంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ రవి కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మధుసూదన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు లక్ష్మీప్రసాద్, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గండిలో హుండీల లెక్కింపు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు వేసిన కానుకలకు సంబంధించిన హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. కడప దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. హుండీల ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు తమ వంటిపై ఎలాంటి విలువైన ఆభరణాలు, జేబులో నగదు లేకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి


శ్రీనివాసపురం వద్ద సజ్జ పంటను పరిశీలిస్తున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామ పొలాల్లో సాగు చేసిన సజ్జ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సజ్జ పంటకు చీడపీడలు, తెగుళ్ల రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 552 హెక్టార్లల్లో వరి, మినుము, సజ్జ, కొర్ర, వేరుశనగ పంటలు సాగు చేశారన్నారు. పంటలకు సంబంధించిన ఎమైనా సలహాలు, సూచనలు కావాలంటే రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి సిబ్బందితో మాట్లాడి సమస్యను వివరించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో శుక్రవారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, విద్య, వైద్య, ఉపాధి హామీ, నీటిపారుదల, వ్యవసాయ, తదితర అంశాలపై చర్చ ఉంటుందని మండలస్థాయి అధికారులు తగిన నివేదికలతో హాజరుకావాలన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆమె తెలిపారు.

జాబ్ మేళాలు నిరుద్యోగులకు వరం లాంటివి


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

జమ్మలమడుగు : నిరుద్యోగులకు జాబ్ మేళాలు వరం లాంటివని వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతస్థాయిలోకి రావాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందరికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడం కష్టతరమైన సమయంలో ప్రైవేట్ సంస్థలు నిర్వహించే జాబ్ మేళాలు నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ఈజాబ్ మేళాలో 300 మంది హాజరు కాగా 240 మందికి ఉద్యోగవకావాలు వచ్చాయి. అమర్‌రాజా కంపెనీలో 111 మందికి, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్‌లో 50 మందికి, డిక్సన్ టెక్నాలజి కొప్పర్తి కంపెనీ 60, న్యూహాలండ్ ట్రాక్టర్స్ కంపెనీలో 19 మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయని తెలిపారు.

పేద విద్యార్థులను ఆదుకోవడం హర్షణీయం


విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న ఎంఈఓ-2 సుభాషిణి

కమలాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేదవారేనని, అలాంటి పేద పిల్లలను దాతలు ఆదుకోవడం హర్షణీయం అని ఎంఈఓ–2 సుభాషిణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మొలకవారిపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు శందాసాని ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో మదర్ థెరిసా సేవా సమితి ఆధ్వర్యంలో వితరణ చేసిన విద్యా సామగ్రిని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దానాలలోకెల్లా విద్యా దానం గొప్పదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి ఇలా పలకలు, నోట్ బుక్స్, పెన్సిల్స్, బ్లాక్ బోర్డు, ప్లేట్లు పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. ఇలా అన్ని ప్రాంతాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందించి ఆదుకోవాలని ఆమె కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దాతలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న అధికారులంతా ప్రభుత్వ బడుల్లో చదివినవారేనన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సమితి అధ్యక్షుడు జూటూరు విజయ్, ఉపాధ్యాయులు సాంబ శివుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి


హాజరైన అన్ని శాఖల అధికారులు

సింహాద్రిపురం : పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఎంపీపీ అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ భీమేశ్వరరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 213 మంది రైతులు చుక్కల భూమి ఫ్రీ హోల్డర్‌గా చేయడం జరిగిందన్నారు. 317 డికెటి భూమిగల రైతులకు ఫ్రీ హోల్డర్‌గా మార్చడంతో పాటు అలాగే ఉచితంగా 1771 కులధృవీకరణాలతో పాటు వివిధ రకాల సర్టిఫికెట్లను జాప్యం లేకుండా దరఖాస్తు చేసుకున్న వారికి పంపిణీ చేసి జిల్లాలో మూడవ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఆగస్టు 14 వరకు డయేరియా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొని పాఠశాలల్లోని వంటశాలలతో పాటు నీటి ట్యాంకులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. ఉపాధి ఈసీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉపాధి ద్వారా ఉద్యానవన సాగుకింద ఈ ఏడాది 600 ఎకరాల్లో చీనీ పంటను సాగు చేయడం జరిగిందన్నారు. ఎకరాకు మూడు సంవత్సరాలకు రూ.1.32 లక్షలు, డ్రాగన్ ఫ్రూట్ అర్థ ఎకరాకు రెండు సంవత్సరాలకు రూ.1.87లక్షలు, బోరులేని రైతులకు మామిడి చెట్లు నాటుకుని ట్యాంకుల ద్వారా నీటి తడులు అందించడానికి ఎకరాకు రూ.1.12 లక్షలు ఉపాధి ద్వారా అందిస్తున్నామని ఆసక్తిగల రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ పద్మనాభరెడ్డి, ఆర్ఐ షేక్షా, పీఆర్ఏఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

దోమల దండయాత్రపై నియంత్రణ ఏది


ఆస్పత్రికి వచ్చిన రోగులతో ర్యాలీ చేస్తున్న అధికారులు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో రోజురోజుకు దోమలు స్వైర విహారం చేస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. దోమల నివారణ చర్యల్లో క్షేత్ర, మండల స్థాయిలో, మున్సిపల్ స్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో దోమకాటుకు గురవుతున్న ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామీణ, మున్సిపల్ ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉండే ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడం దోమల వృద్ధికి కారణమవుతోంది. డెంగ్యూ, మాలేరియా, విభాగం అధికారులు నామమాత్రంగా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగులతో ర్యాలీలు చేస్తున్నారు. మురికి వాడలలో వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహించడం లేదని ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.